ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 29 మార్చి 2024 | 5



రంజాన్ వేళలు: ఇఫ్తార్ (శుక్ర) సా.6.24 | సహరి (శని) ఉ.4.38

రెండోరోజూ నావికాదళ విన్యాసాలు

కరపలో ట్రాఫిక్ ఎస్ఐపై మందుబాబుల దాడి - 7లో

ఈసీలకు సర్వర్ సమస్య



పెద్దాపురం, మార్చి 28: సర్వర్ సమస్య కారణంగా జిల్లాలో వారంరోజులుగా ఈసీల మంజూరు నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్లకు సంబంధించి క్రయ, విక్రయాల్లో ఈసీలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. స్థిరాస్తులైన ఇళ్లు, ప్లాట్లు, పొలాలు, అపార్ట్‌మెంట్లు కొనాలంటే కచ్చితంగా వీటిద్వారా పరిశీలన చేసుకోవాల్సిందే. స్థిరాస్తికి సంబంధించి పూర్తి వివరాలు ఈసీలో ఉంటాయి. ఆస్తి ఎక్కడినుంచి వచ్చింది, ఇప్పటి వరకూ ఎంతమంది అమ్మకాలు జరిపారు, ఆస్తి తనఖా లో ఉందా, రుణాలు తీసుకున్నారా మొదలైన వివరాలు ఈసీ ద్వారా తెలుస్తాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఇవి ప్రస్తుతం వారం రోజులుగా మంజూరు కావడం లేదు.

సర్వర్ సమస్య కారణంగానే..

ప్రస్తుతం పదిరోజులుగా ఈసీలు రావడంలేదు. సమస్య ఈ జిల్లాకు మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్లశాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన 2.0 కారణంగానే ఈ సమస్య ఉంది. 1.0 నుంచి 2.0 కు సాఫ్ట్‌వేర్‌ను మార్చుతున్న కారణంగా సమస్య తలెత్తింది. ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరమయ్యేలా రాష్ట్రస్థాయి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

-పి.రామలక్ష్మి పట్నాయక్, జిల్లా రిజిస్ట్రార్, కాకినాడ

వారం రోజులుగా..

కాకినాడ జిల్లావ్యాప్తంగా కాకినాడ, కాకినాడ రూరల్, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, తాళ్లరేవు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల ద్వారా రోజుకు సగటున 400 వరకూ ఈసీలు పొందుతుంటారు. ఒక్క ఈసీ సర్వీసు రుసుంతో కలిపి రూ.300 ఉంటుంది. అంటే రోజుకు రూ.1.20 లక్షల వరకూ రిజిస్ట్రేషన్‌శాఖకు రాబడి ఉంటుంది. దాదాపు పది రోజులకుపైగా జిల్లావ్యాప్తంగా నిలిచిపోవడంతో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు రూ.లక్షల్లో రాబడి కోల్పోయినట్లయ్యిందని చెప్పాలి. దీంతోపాటు ఈసీ ఉంటేనే కొత్త కొనుగోళ్లు చేస్తారు. వారంరోజులుగా నిలిచిపోవడంతో దస్తావేజులపై ప్రభావం పడింది.

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిలిచిన సేవలు
- తరచూ సాంకేతిక సమస్యలు
- ఆస్తుల క్రయ విక్రయాలు, ఇతర లావాదేవీలకు తీవ్ర జాప్యం
- వినియోగదారుల్లో అసహనం

కలెక్టర్‌గా నివాస్



- జిల్లా కొత్త కలెక్టర్‌గా నివాస్‌ను నియమించిన సీఈసీ
- నేడు బాధ్యతల స్వీకరణ
- మెటర్నిటీ సెలవుపై వెళ్లిన ప్రస్తుత కలెక్టర్ కృతికాశుక్లా
- ఆమె స్థానంలో ముగ్గురి పేర్లు పరిశీలన.. నివాస్‌వైపే మొగ్గు
- కోడ్ ఉల్లంఘనపై త్వరలో విచారణ జరగనున్న దశలో కృతికా ఆకస్మిక సెలవు
- కోడ్ ఉల్లంఘించి వైసీపీకి అనుకూలంగా సమావేశం ఏర్పాటు చేశారని ఈసీకి టీడీపీ ఫిర్యాదు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లా కొత్త కలెక్టర్‌గా జె.నివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ గురువారం తక్షణ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కొత్త కలెక్టర్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. 2010బ్యాచ్‌కు చెందిన నివాస్ ప్రస్తుతం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా అమరావతిలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ కృతికాశుక్లా ప్రసూతి సెలవు కోరుతూ ఇటీవల ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు గురువారం నుంచి 180రోజుల ప్రసూతి సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఆమె స్థానంలో కొత్త కలెక్టర్‌గా కేంద్ర ఎన్నికల కమిషన్ నివాస్‌ను ఎంపిక చేసింది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కొత్త కలెక్టర్ ఎంపికకు సంబంధించి ముగ్గురు అధికారులతో కూడిన పేర్లను సూచించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఈసీ ఆదేశించింది. దీంతో గతంలో ఇక్కడ పనిచేసిన హరికిరణ్, జె.నివాస్, శ్రీకేష్ బాలాజీ పేర్లను ప్రభుత్వం సీఈసీకి పంపింది. ఈ నేపథ్యంలో ఇవన్నీ పరిశీలించిన సీఈసీ నివాస్‌ను కలెక్టర్‌గా ఎంపిక చేసింది. నివాస్‌కు ముక్కుసూటి అధికారిగా పేరుంది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలోను సమర్థవంతంగా వ్యవహరిస్తారని పేరు తెచ్చుకున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో షెడ్యూల్ విడుదలైన తర్వాత శ్రీకాకుళం కలెక్టర్ ఎం.రామారావును సీఈసీ ఆకస్మికంగా బదిలీ చేసింది. ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కృతికాశుక్లా సెలవుపై వెళ్లడంతో నివాస్‌ను కలెక్టర్‌గా ఎంపిక చేయడంవిశేషం. ఆయన గతంలో గూడూరు సబ్‌కలెక్టర్‌గా, ఉట్నూరు ఐటీడీఏ పీవో, ఏపీఐఐసీ ఎండీ, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. తమిళనాడుకు చెందిన ఆయన విట్‌లో మెకానికల్‌ఇంజనీరింగ్ చదివారు.

మెడపై విచారణ కత్తి.. అందుకేనా..

జిల్లాల పునర్విభజనలో భాగంగా కృతికాశుక్లా 2022, ఏప్రిల్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె పూర్తిగా వైసీపీ అనుకూల అధికారిగా ముద్రపడ్డారు. కలెక్టరేట్‌ను పూర్తిగా రహస్య పాలన కేంద్రంగా మార్చేశారు. కాకినాడ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా ఎమ్మెల్యే ద్వారంపూడికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు తీవ్రంగా వచ్చాయి. ఆర్వో నియామకం దగ్గరనుంచి ఓట్ల తొలగింపు ప్రక్రియ వరకు అడుగడుగునా అడ్డగోలుగా సహకరించారు. ఐదేళ్లు దాటిన కార్పొరేషన్ కీలక అధికారులను ఎమ్మెల్యేకు ఎన్నికల్లో సహకరించేలా వారిని కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడం విమర్శలకు దారితీసింది. వైసీపీ నేతల ఒత్తిళ్లకు లొంగి కాకినాడ మడ భూముల్లో ఎన్జీటీ ఆదేశాల మేరకు మొక్కలు నాటకుండానే నాటినట్లు తప్పుడు నివేదికలు ఇచ్చి కలెక్టర్ ఇరుకునపడ్డారు. ఇటీవల కలెక్టరేట్‌లో మత్స్యకారులకు ఓఎన్జీసీ, సీపోర్టు, ఇతర ప్రభుత్వశాఖలతో కలెక్టర్ కృతికాశుక్లా సమావేశం నిర్వహించారు. ఓఎన్జీసీ సిస్మిక్ సర్వేతో నష్టపోతున్న మత్స్యకారులకు సీఎస్ఆర్ నిధులతో కాకినాడ పరిసర గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి సమావేశం అంగీకరించింది. దీనిపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాకినాడ నియోజకవర్గ టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. కోడ్ అమల్లో ఉండగా అధికార వైసీపీకి ఎన్నికల్లో లబ్ధి కలిగేలా కలెక్టర్ కృతికాశుక్లా నిర్ణయం తీసుకుని, సమావేశం ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై రేపోమాపో ఈసీ ఆదేశాల మేరకు విచారణ జరగనుంది. కానీ ఈలోపే కలెక్టర్ కృతికాశుక్లా అకస్మాత్తుగా ప్రసూతి సెలవుపై వెళ్లడంపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈసీ విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతోనే సెలవుపై వెళ్లిపోయారని ఆరోపిస్తున్నారు.

కోడ్ కూయక ముందే.. సర్దేశారు!



- పిఠాపురంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంపై విమర్శలు
- ఎన్నికల షెడ్యూల్‌కు రెండురోజుల ముందు అపాయింట్మెంట్ లెటర్లు
- భారీగా సొమ్ములు చేతులు మారినట్లు ఆరోపణలు

పిఠాపురం, మార్చి 28: కోడ్ కూయకముందే కావాల్సిన వారికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించుకున్నారు. ఆఘమేఘాలపై అనుమతులు తెచ్చేసుకున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని కాదని సొమ్ములు ఇచ్చిన వారికే పోస్టులు దక్కినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇందులో అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు, ఒక మునిసిపల్ అధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఇప్పుడు ఇదే విషయం వైసీపీలో చిచ్చురేపింది.

పిఠాపురం పురపాలక సంఘంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్, పదవీ విరమణ చేసిన, పీహెచ్, నాన్ పీహెచ్ వర్కర్లను మరో పోస్టుకు మార్పు చేయడంతో ఏడు ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్సింగ్ సర్వీసెస్(ఆప్కోస్) భర్తీచేయాల్సి ఉంటుంది. సాధారణంగా ఇటువంటి ఖాళీలను భర్తీ చేసే సమయంలో అప్పటికే పురపాలక సంఘంలో రోజువారీ పద్ధతి, కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న వారికి ప్రాధాన్యమిస్తారు. వీరిని ఎవరినీ పరిగణనలోకి తీసుకోకుండా ఏడు పోస్టులను రహస్యంగా భర్తీ చేయడం ఇప్పుడు ఆరోపణలకు తావిచ్చింది. గతేడాది డిసెంబరు 23న ఈ పోస్టుల భర్తీకి అనుమతులు రాగా, జనవరి 18న జిల్లా కమిటీ ఆమోదంతో ఆప్కోస్‌కు పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపారు. అక్కడినుంచి ఆదేశాలు రావడంతో వీరికి ఎన్నికల కోడ్ వచ్చే రెండురోజుల ముందు నియమాక ఉత్తర్వులు ఇచ్చేశారు. అప్పటికే వీరంతా రెండు నెలలుగా విధుల్లో ఉన్నారు.

చక్రం తిప్పిన అధికార పార్టీ కీలక నేతలు

పోస్టుల భర్తీలో అధికార వైసీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి, గతంలో పిఠాపురం పురపాలక సంఘంలో పనిచేసి బదిలీ అయిన ముఖ్యఅధికారి, ఐదుగురు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో పోస్టుకు రూ.3నుంచి రూ.5లక్షల వరకూ చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో ఒక అధికారి కీలకపాత్ర పోషించినట్లు చెబుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యే, జిల్లా అధికారుల సిఫారసులతో వీరిని నియమించామని అధికారులు చెబుతున్నారు. జరిగింది వేరని సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన ముఖ్య అధికారి అంతా తానై చక్రం తిప్పినట్లు చెబుతున్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల అనుచరులు, బంధువులు ఉన్నారు. తమను ఆప్కోస్ ద్వారా ఉద్యోగులుగా నియమించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులు పలుమార్లు వినతులు ఇచ్చినా వారిని పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

అవసరమైతే పార్టీకి రాజీనామా

తాజాగా ఏడు ఉద్యోగాల భర్తీ విషయం వెలుగుచూడడంతో వైసీపీ కౌన్సిలర్లు కొందరు తమకు తెలియకుండా ఎలా భర్తీ చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కీలక ప్రజాప్రతినిధిని ప్రశ్నించిన కౌన్సిలర్లకు సరైన సమాధానం రాకపోవడంతో పదిమంది కౌన్సిలర్లు రహస్యంగా సమావేశమయ్యారు. ఈ విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే పార్టీకి రాజీనామా చేసేందుకు వెనుకాడవద్దని ఈ సమావేశంలో వారు మాట్లాడుకున్నట్లు సమాచారం.

నా ప్రమేయం లేదు: మునిసిపల్ కమిషనరు

ఉద్యోగాల భర్తీలో తన ప్రమేయం ఏమీ లేదని, ఆప్కోస్ నుంచి అనుమతులు రావడంతో వారందరికీ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు మునిసిపల్ కమిషనరు కనకరావు తెలిపారు. ఇదంతా తాను రాక ముందే జరిగిందని చెప్పారు.

అర్చకులపై దాడి సంఘటనపై విచారణ నివేదిక పంపాం

- దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 28: కాకినాడ దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల మీద దాడి జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు విచారణ నివేదిక పంపామని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు తెలిపారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ దేవాలయంలో దాడి సంఘటనపై పూర్తి ఆధారాలు సేకరించామన్నారు. ఉద్యోగులు, అర్చకుల స్టేట్‌మెంట్ నమోదు చేశామని తెలిపారు. దాడి చేసిన వారిపై తదుపరి చర్యల కోసం దేవదాయ శాఖ కమిషనర్, కాకినాడ డీఎస్పీలకు నివేదిక అందజేశామన్నారు. తమ పరిధిలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

సువిధ యాప్‌తో 24 గంటల్లో అనుమతులు

- అభ్యర్థులు యాప్‌పై అవగాహన పెంచుకోవాలి: కలెక్టర్ కృతికాశుక్లా



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 28: సువిధ యాప్ ద్వారా 24 గంటల్లో ప్రచార అనుమతులు లభిస్తాయని, దీనిపై ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ కృతికాశుక్లా సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి ఈ యాప్‌ను ఉపయోగించాలన్నారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన మార్గదర్శకాలను ప్రతివారం రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరిస్తున్నామన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16,14,198మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఇంకా కొనసాగుతుందన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామావళి పటిష్ట అమలుకు సీవిజిల్ యాప్, పోలీస్‌లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటస్టిక్స్ సర్వేలైన్సు ఇతర బృందాలు నిత్యం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులపై నమోదైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు పంపిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఆయా కేంద్రాలవద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మూడు ప్రత్యేక బృందాలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాయన్నారు. చెక్‌పోస్టులవద్ద నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి మద్యం తరలిపోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్, ఓటర్ల జాబితా, ఫారం 6, 7, 8, ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, కౌంటింగ్ కేంద్రాలు, ఈఈ ప్యాడ్స్, కంట్రోల్ రూమ్‌లు వంటి అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, కాకినాడ డీఎస్పీ హనుమంతురావు, ఎన్నికల విభాగం అధికారి జగన్నాథం, రాజకీయపార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, గంగాధర్, సబ్బారపు అప్పారావు, ఎన్‌వీవీ సత్యనారాయణ, కె.వీరబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో దళారులను అరికట్టాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 28: రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలులో దళారులను అరికట్టాలని, సకాలంలో ధాన్యం రైతులనుంచి సేకరించాలని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ విధాన గౌతమీ సమావేశం హాలులో గురువారం రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి ధాన్యానికి నిర్దేశించిన కనీస మద్దతు ధర ప్రకారం సేకరించాలన్నారు. ధాన్యం సేకరించిన ప్రతి రైతు వేలిముద్ర విధిగా తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరించడానికి జిల్లావ్యాప్తంగా అవసరమైన గోను సంచులను సిద్ధం చేయాలన్నారు. రవాణా నిమిత్తం జీపీఎస్ అమర్చిన వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించే ధాన్యం సేకరణ జరగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాలసరస్వతి, ఏడీఏలు, ఎంఏవోలు పాల్గొన్నారు.

వలంటీర్ల ఓట్ల వేట!



- కులాల వారీగా వివరాల సేకరణ
- వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం

తుని రూరల్, మార్చి 28: సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే బాధ్యత వలంటీర్లది.. అందుకు ప్రభుత్వం గౌరవ భృతి ఇస్తుంది. కానీ, ఎన్నికలవేళ వీరిని తమ పార్టీ సేవకులుగా మార్చి వైసీపీ అన్ని విధాలా ప్రయత్నం చేస్తోంది. వలంటీర్లను ఏ రూపంలోను ఎన్నికల విధులకు, ప్రచారాలకు వినియోగించకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చినా జిల్లాలో పార్టీకోసం పనిచేయాలని ఓటర్లను ఒప్పించి ఓట్లు వేయించాలని వైసీపీ నేతలు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం 50ఇళ్లకు వలంటీర్‌ను నియమించింది. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో కాకినాడ నగరపాలకసంస్థ, మరో ఆరు మున్సిపాల్టీలతో పాటు 20 మండలాల్లో 11,273మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో 90శాతానికిపైగా వైసీపీ కార్యకర్తలు, నేతలఅనుచరులు కావడం విశేషం.

ప్రచారానికి ప్రత్యేక గ్రూపులు

కొంతమంది వలంటీర్లు 50ఇళ్లకు ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూపులు పెట్టి వాటిలో వైసీపీ నేతలను చేర్చి ఆ పార్టీకి సంబంధించిన ప్రకటనలు, నేతల ప్రసంగాలతో సందేశాలను పంపుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, వలంటీర్లపై నిఘా ఉండడంతో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఈ గ్రూపుల నిర్వహణ గృహసారథులకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ రాకముందే జిల్లాలో పలు నియోజకవర్గాల్లో మండలాలవారీగా గ్రామ వలంటీర్లు, గృహసారథులు, బూత్ కమిటీ కన్వీనర్లతో వైసీపీ నేతలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గడప గడపకు వెళ్లి ఓట్లు ఎలా ఒడిసి పట్టాలో సూచనలు ఇచ్చారు. తుని నియోజకవర్గంలో అయితే మరో అడుగు ముందుకు వేసి వలంటీర్లకు సెల్‌ఫోన్ రూపంలో తాయిలాలు, విందు ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. పథకాల లబ్ధిదారులను ఎలా దారి తెచ్చుకోవాలి. అందుకు ఏం చేయాలో వివరించడంతోపాటు ప్రతిఫలంగా పార్టీ అభ్యర్థుల ద్వారా కొంత మొత్తాన్ని ముట్టజెప్పేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సమాచారం సేకరణ

ఇప్పటికే వలంటీర్ల ద్వారా వారి పరిధిలోని 50ఇళ్లలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు. వారిలో ఏ పార్టీకి ఓటు వేస్తారు. ఏఏ సామాజిక వర్గానికి చెందిన వారు అని సేకరించి బూత్ కమిటీలకు చేరవేసినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రయోజనాలకు, వలంటీర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్ ముగ్గురిని అనుసంధానం చేసి సమన్వయంతో పనిచేయాలని వైసీపీ నేతలు, అభ్యర్థులు సూచనలు ఇచ్చినట్లు తెలిసింది. ఏ గడప ఏ పార్టీ వైపు ఉంది వారిని ఎలా లొంగదీసుకోవాలన్న దానిపై ఎమ్మెల్యే అభ్యర్థులు వలంటీర్లనుంచే సమాచారం తీసుకుంటున్నారు. ఓటర్లను ప్రభావితం చేయగల సమర్థులు వలంటీర్లను ఇప్పటికే ఎంపిక చేసి వారిని వలంటీర్ల పోస్టులకు రాజీనామా చేసి ప్రత్యక్షంగా ప్రచారంలో పాల్గొనాలని వైసీపీ నాయకులు కోరుతున్నట్లు తెలుస్తోంది. అందుకు ప్రతిఫలంగా డబుల్ జీతం తామే ఇస్తామని మరోమారు వైసీపీ ప్రభుత్వం వస్తే ఉద్యోగం యథావిధిగా రాజీనామా చేసిన వారికి ఇచ్చేందుకు వైసీపీ అభ్యర్థులు హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక అవసరాలుగల విద్యార్థుల గుర్తింపు శిబిరం

కాకినాడ రూరల్, మార్చి 28: జిల్లా సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త, డీఈవో పి.రమేష్ ఆదేశాల మేరకు జిల్లాలోని తాళ్లరేవు, కరప, కాజులూరు, కాకినాడ రూరల్, పెదపూడి, కాకినాడ అర్బన్ మండలాలకు ప్రభుత్వ, భవితా సెంటర్లలో విద్యార్థుల గుర్తింపు శిబిరాన్ని గురువారం నిర్వహించినట్లు జిల్లా ఐఈ సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు తెలిపారు. 1నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఉపకరణాల పంపిణీ కోసం నిర్ధారణ నిమిత్తం లోపాలుగల విద్యార్థుల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నాగేశ్వరరావు వివరించారు. నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన పరికరాలకోసం రాష్ట్రకార్యాలయానికి నివేదికలు పంపిస్తామన్నారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం ప్రతి మండలంలోను భవిత కేంద్రాలు నిర్వహిస్తామని తెలిపారు. వారికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు శిక్షణ అందిస్తారన్నారు. శిబిరంలో కాకినాడ అర్బన్ మండలం డీఐఎస్ సీహెచ్ రవి, ప్రభుత్వ వైద్యులు కె.సత్యసాగర్, జి.మాధురి, ఉమామహేశ్వరి, కృష్ణవాసన్, ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఐఈ సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు

ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ వైసీపీకి రాజీనామా

ఏలేశ్వరం, మార్చి 28: ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ సత్యవతితోపాటు ఆమె భర్త అలమండ చలమయ్య వైసీపీకి రాజీనామా చేశారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చలమయ్య మాట్లాడుతూ గతంలో వైసీపీలో గెలిచి టీడీపీలోకి వెళ్లి వచ్చినా పార్టీ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ వరుపుల సుబ్బారావును కలిసి మద్దతు తెలిపామన్నారు. అయినా పట్టణాభివృద్ధి కోరుకోకుండా పార్టీ ఇన్‌చార్జ్ సుబ్బారావు సమీప బంధువు ఎమ్మెల్సీ అనంతబాబు ఏలేశ్వరం నగర పంచాయతీ తీర్మానానికి వ్యతిరేకంగా వ్యవహారశైలి ఉందని, దీనిగురించి అధిష్ఠానానికి గతంలో తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. వారు చేసే పనులు ఆత్మాభిమానం దెబ్బతీసేలా ఏకపక్ష నిర్ణయాలుగా ఉన్నాయన్నారు. 30ఏళ్లుగా ఏలేశ్వరం అభివృద్ధే కోరుకున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తోపాటు ఆయన సన్నిహితులు పట్టణంపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపణలు చేశారు. నగర పంచాయతీ పాలకవర్గం చేసిన తీర్మానాలకు విరుద్ధంగా వ్యవహరించడం పట్టణ ప్రజలను అవమానించడమేనన్నారు. వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, తుని నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న పదవులతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న తన భార్య సత్యవతి కూడా పార్టీకి రాజీనామా చేస్తున్నారన్నారు. తమతోపాటు మాజీ ఎంపీటీసీ పాండ్రంకి అప్పారావు, మాజీ కౌన్సిలర్ కడింశెట్టి వాసు, మలిరెడ్డి సూరిబాబు, రజక సంఘ నాయకులు అంజూరి రాజారావు, కాకాడ నాగేశ్వరరావు, జామి ఆదినారాయణ, గూడవిల్లి అర్జునరావు, ఆకాశపు బుల్లియ్య, గూనాపు అప్పలరాజు, సామంతుల చిన్నారావు, మలకుర్తి నాగేశ్వరరావు, సింహాద్రి బ్రహ్మం నియోజకవర్గంలో వైసీపీ నాయకులు తీసుకునే ఏకపక్ష నిర్ణయాలు తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. తదుపరి కార్యాచరణ పది రోజుల్లో తెలియజేస్తామన్నారు.



మాట్లాడుతున్న అలమండ చలమయ్య.. పక్కనే చైర్‌పర్సన్ సత్యవతి

వారాహి వస్తోంది..


- రేపు ఉదయం పిఠాపురానికి పవన్
- సాయంత్రం చేబ్రోలులో సభ

- 7లో

వారాహి వస్తోంది..

ఎన్నికల శంఖారావం పూరించడానికి





- రేపు సాయంత్రం చేబ్రోలులో సభ
- ఆ రోజు ఉదయమే పిఠాపురానికి పవన్

పిఠాపురం, మార్చి 28: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తన ప్రచారానికి ఈనెల 30వ తేదీన శ్రీకారం చుట్టనున్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి వారాహి విజయభేరి మోగించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4గంటలకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు రామాలయం సెంటర్‌లో జరిగే సభలో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగించనున్నారు. పవన్‌కల్యాణ్ తాను పోటీ చేయనున్న పిఠాపురం నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారికంగా సమాచారం అందింది. ఆ మేరకు పార్టీ నాయకులు అనుమతులు కోసం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వోకు, పోలీసులకు గురువారం సాయంత్రం దరఖాస్తు చేశారు. 30వ తేదీన హెలికాప్టర్‌లో పవన్‌కల్యాణ్ గొల్లప్రోలు పట్టణ శివారులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి పురుహూతికాశక్తి పీఠానికి చేరుకుని వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. దత్త పీఠాన్ని దర్శించుకుంటారు. అనంతరం పిఠాపురం మండలం కుమారపురంలోని ప్రైవేటు హోటల్‌కు చేరుకుని అక్కడ బసచేసి సాయంత్రం వారాహి వాహనంపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం 4గంటలు నుంచి జరిగే వారాహి విజయభేరి యాత్రలో పాల్గొని సభకు హాజరయిన వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని కేంద్ర కార్యాలయం నుంచి సూచనలు జారీ కావడంతో ఏర్పాట్లు చేయడంలో జనసేన నాయకులు నిమగ్నమయ్యారు. కాగా పవన్ రాష్ట్రవ్యాప్త ప్రచారానికి వినియోగించే వారాహి వాహనం గురువారం రాత్రి కాకినాడ చేరుకుంది.

అబ్బురపరిచాయి

రెండో రోజూ కొనసాగిన నావికాదళ విన్యాసాలు



సర్పవరం జంక్షన్, మార్చి 28: కాకినాడ సాగరతీరంలో సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత్ త్రివిధ దళాలు-అమెరికా యాంపీబీయాస్ టైగర్ ట్రయంఫ్-2024 సైనిక విన్యాసాలు రెండో రోజు గురువారం కూడా కొనసాగాయి. ఎక్స్ టైగర్ ట్రయంఫ్ సీ ఫేజ్‌లో భాగంగా యుద్ధ సమయంలో శత్రువులపై ఆకాశం, భూభాగం, సముద్రం పై నుంచి త్రివిధ దళాలు జరిపే పోరాటం, యుద్ధ నైపుణ్యాల ప్రదర్శన, యుద్ధ ట్యాంకర్లు, యుద్ధ నౌకలు, ఆయుధాల వినియోగం, హెలికాప్టర్ల ద్వారా శత్రువుల శిబిరాలపై దాడులు చేశారు. బంకర్లలో ఆర్మీ సిబ్బంది ఆయుధాలతో జల, భూ ఉపరితలం, ఆకాశమార్గాల ద్వారా శత్రువుల శిబిరాలపై ఫిరంగులు, బాంబులతో బాంబుల మోత మోగించారు. ఈ యాంపీబీయాస్ విన్యాసాలు ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో రాకపోకలు నిషేధించామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనదారులు వెళ్లాలని కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె. శ్రీనివాస్ కోరారు.



‘షాలిమార్’లో సాంకేతిక లోపం

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో నిలిపివేత

ఐదు గంటలకు పైగా ప్రయాణికులకు నరకం



నిలిచిపోయిన ఎక్స్‌ప్రెస్



అధికారులతో వాగ్వాదం

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): షాలిమార్- సికింద్రాబాద్ వారాంతపు రైల్లో (నెం.22849) సాంకేతిక లోపం ఏర్పడి రాజమండ్రి రైల్వే స్టేషనులో 5.30 గంటలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సికింద్రాబాద్ వెళ్తున్న రైలుకు కడియం రైల్వే స్టేషను దాటిన తర్వాత రైలు బోగీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు రైలును నెమ్మదిగా రాజమండ్రి తీసుకొచ్చి రెండో ప్లాట్‌ఫాం వద్ద నిలిపారు. వెంటనే రైల్వే ఎలక్ట్రికల్ తదితర విభాగాల సిబ్బంది రంగంలోకి దిగి లోపాన్ని గుర్తించే పని చేపట్టారు. ఇంజన్‌లో లోపం ఉందనుకొని వేరొక ఇంజను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. ముందువైపు ఉన్న జనరేటర్ బోగీ (పవర్ కార్)లో లోపం తలెత్తిందని గుర్తించారు. ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వెనుక కూడా వేరొక ఇంజను అమర్చి- వెనుక ఉన్న పవర్ కార్ ద్వారా విద్యుత్తు సరఫరా చేశారు. దీంతో ఉదయం 7.30గంటలకు వచ్చిన రైలు మధ్యాహ్నం 1గంటలకు బయలుదేరింది. అప్పటికే ఈ రైలు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తుండడం గమనార్హం.

● ప్రయాణికులకు నరకం

రైలుకు 19బోగీలు ఉండగా అందులో 12 ఏసీ బోగీలు ఉన్నాయి. మొత్తం అన్ని బోగీల్లోనూ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఏసీలు ఆగిపోవడంతో ఆ బోగీల్లోని ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గాలి ఆడకపోవడంతో చిన్న పిల్లలు అవస్థలు పడ్డారు. సెల్‌ఫోన్లలో చార్జింగ్ అయిపోవడంతో ప్లాట్‌ఫాంపై ఉన్న సాకెట్లలో చార్జింగ్ పెట్టుకొన్నారు. కొన్ని బోగీల్లో నీటి సరఫరా కూడా ఆగిపోయింది. ప్యాంట్రీ కార్ (వంట బోగీ)లో కూడా విద్యుత్ నిలిచిపోవడంతో టీ తయారు చేయడానికి కూడా వీలు లేకుండా పోయింది. గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు సహనం కోల్పోయారు. రెండో ప్లాట్‌ఫాంపై ఉన్న స్టేషను మాస్టారు గది వద్ద గుమిగూడి అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ బంధువు హార్ట్ పేషెంట్ అని, అన్ని గంటలు ఏసీలు ఆగిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారంటూ ఓ మహిళ స్టేషను మాస్టారు వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్ఐ లోవరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. స్టేషను మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ సురేంద్ర, లోకో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

కవలగొయ్యిలో వ్యక్తి హత్య

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అతని తల్లి పలుకూరి సరోజిని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ కవలగొయ్యి ప్రాంతానికి చెందిన సరోజిని చిన్న కుమారుడు భాస్కరరావు(35)కు సత్యవాణితో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. తర్వాత మనస్పర్థల వల్ల 12 ఏళ్ల క్రితమే కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. దీంతో భాస్కరరావు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. అదే ప్రాంతంలో పాత ఇనుము వ్యాపారం చేసే గుజ్జు లక్ష్మి భర్తతో గొడవల వల్ల ఐదేళ్ల నుంచి విడిగా ఉంటోంది. భాస్కరరావుకు ఆమెతో పరిచయం ఏర్పడి మూడున్నరేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. ఈ మధ్య భాస్కరరావును ఇంటికి రావద్దంటూ లక్ష్మి దూరం పెట్టింది. దీంతో అతడు తాగుడుకు బానిసయ్యాడు. ఇదిలా ఉండగా.. భాస్కరరావుతో కందిరెల్లి నారాయణమూర్తి అనే వ్యక్తి కొన్ని రోజులుగా పరిచయం పెంచుకున్నాడు. అతడితో లక్ష్మికి పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో భాస్కరరావును నారాయణమూర్తి లక్ష్మీనగర్‌లో ఉన్న గంగుల సూర్యనారాయణ లేఅవుట్ దగ్గరలో వాచ్‌మన్ నివాసం ఉండే పాక వద్దకు తీసుకెళ్లి మందు తాగించాడు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో భాస్కరరావును పొడుస్తుండగా వాచ్‌మన్ చూసి పారిపోయాడు. గురువారం ఉదయం తన వద్దకు వచ్చి వాచ్‌మన్ విషయం చెప్పగా అక్కడకు వెళ్లి చూడగా తన కొడుకు భాస్కరరావు రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడని సరోజిని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న విధ్వంసకర, అరాచక పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదలు నిలువునా వంచింపబడుతున్నారని, ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో రాజమండ్రి పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, అసెంబ్లీ వారీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, కోర్ కమిటీ, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండలం అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురందేశ్వరితో పాటు బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే పోలీసు కేసులు నమోదు చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని మార్చడానికి చూపుడువేలును ఉపయోగించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయాన్ని కూడా తనఖా పెట్టిన పరిస్థితి ఉందన్నారు. ఇసుక లేకపోవడం వల్ల రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారన్నారు. బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించలేదని, దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కలగడంలేదని అన్నారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తరపున ఎవరు నిలబడినా అక్కడ నిలబడింది మోదీగానే భావించాలన్నారు. విశాఖ డ్రగ్స్ కేసులో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. సిద్ధార్థ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామని హామీ ఇస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థి శివరామకృష్ణ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్, సాగి కాశీ విశ్వనాథరాజు, కోడూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



కొవ్వూరు, మార్చి 28: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. కొవ్వూరు టౌన్, రూరల్ పోలీసుస్టేషన్లు, డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో కలెక్టర్‌లు, ఎస్పీలను సమన్వయం చేసుకుని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యులలో ఇంతవరకు ఆరు జిల్లాల్లో 1842 ఎన్‌బీడబ్ల్యులు ఎగ్జిక్యూట్ చేశామన్నారు. జిల్లాలో వీఐపీలు, ప్రజా ప్రతినిధులు పర్యటించినప్పుడు భద్రతా పరంగా బందోబస్తు నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకుండానే డిసెంబరు నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ అమలు ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఐడీ లిక్కర్, పులిసిన బెల్లపు ఊట, ఎన్‌డీపీఎల్ సీసాలు, టెట్రా ప్యాకెట్‌లు డీపీఎల్ (గంజాయి), ఎన్‌డీపీఎస్, క్యాష్, ప్రీసీయస్ మెటల్, ఫ్రీ బీస్ తదితరాలకు చెందిన 7489 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 4067 మందిని అరెస్టు చేసి రూ.15,53,74,279 విలువ గల వాటిని సీజ్ చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని తగ్గించడానికి చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి దాడులు మరింత తీవ్రతరం చేశామన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సరళిపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి పోలింగ్ రోజు తీసుకోవలిసిన భద్రతా పరమైన చర్యలు, కౌంటింగ్ సమయంలో ఏ విధమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణను అందజేస్తున్నామన్నారు. పోలీసు సిబ్బంది ఎటువంటి తప్పులు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ పి.జగదీష్, డీఎస్పీ కేసీహెచ్ రామారావు,సీఐలు వి.జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి అధికారుల హామీ

వంతుల వారీ విధానం లేకుండానే బీడు భూములకు నీరివ్వాలని నిర్ణయం



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

తాళ్లరేవు, మార్చి 28: వంతుల వారీ విధానంతో ఎటువంటి సంబంధం లేకుండా గ్రాంటు ప్రాంతంలో వరిచేలకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు హామీ ఇచ్చారు. ‘వరిచేలో రయ్ రయ్, బీడుబారిన వరిచేలు’ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారుల బృందం గ్రాంటు ప్రాంతానికి కదలింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటులో ఎండిన వరిచేలు, ద్విచక్ర వాహనాలు తిప్పిన వరిచేలను ఇరిగేషన్ అధికారుల బృందం పరిశీలించింది. ముందుగా ఇరిగేషన్ అధికారి, సిబ్బందితో కారులో సర్వే చేసి రైతులకు ఏ సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడంతో రైతులు ఆగ్రహించి రోడ్డుపై పురుగు మందుల డబ్బాలను పట్టుకుని రాస్తారోకో నిర్వహించారు. సాగు నీరు ఇస్తారా.. పురుగుల మందు తాగమంటారా అంటూ రైతులు నినాదాలు చేశారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, ఈఈ రామకృష్ణ, ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ హిమరత్నం, ఏఈ ఈశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో రైతులు అధికారులను సాగునీరు ఇవ్వాలని నిలదీశారు. ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల ఇబ్బందులను వివరించి వారితో చర్చలు జరిపారు. ఈ రోజు నుంచి వంతులవారీ విధానంతో సంబంధం లేకుండా 15 రోజుల పాటు సాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామన్నారు. ఇంజన్లతో సాగునీరు కాలువలోకి డంప్ చేసి ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఓఎన్‌జీసీ ప్రతినిధులతో రైతుల సహకారంతో వినతిపత్రం అందించి సాగునీరు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. దీంతో తాత్కాలికంగా రైతుల సమస్య పరిష్కారమైంది. కోరింగ ఎస్ఐ రవికుమార్, ఏఎస్ఐ సత్యనారాయణమూర్తి, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించి న్యాయం చేయాలి: దాట్ల బుచ్చిబాబు

గ్రాంటు రైతులకు సాగునీరు అందించి పంటనష్టపోకుండా చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో కోరారు. రైతులకు సాగునీరు అందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం, ఇన్సూరెన్స్ రాయితీలను అందివ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. వ్యవసాయ సాగు చేసే రైతులందరికీ మత్స్యకారుల తరహాలో పంట నష్టపరిహారాన్ని ప్రతి రైతుకు అందించేలా చర్యలు చేపట్టాలని రైతు ఎం.డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ ఎస్ఐపై దాడి

రోడ్డుపై వీరంగం సృష్టించిన మందుబాబులు

తీవ్రంగా గాయపడ్డ ఎస్ఐ ● ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన ఎస్ఐ



నిందితుడు కేశవ వీరంగం

కరప, మార్చి 28: కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంకలో గురువారం సాయంత్రం మందుబాబులు విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్.కిషోర్‌కుమార్ యానాం జాతీయ రహదారిపై ఉప్పలంక వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నారు. ఆ సమయంలో మోటర్‌సైకిల్‌పై అటుగా వెళ్తున్న పాలెపు రాజు అనే వ్యక్తిని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. అయితే బైక్ వెనుక ఉన్న అతని బావమరిది కర్రి కేశవ మద్యం మత్తులో ట్రాఫిక్ ఎస్ఐతో వాగ్వాదానికి దిగాడు. తన బావ రాజు మద్యం సేవించలేదని, ఖైనీ ప్యాకెట్ వేసుకుంటే మందు తాగినట్టు మిషన్ తప్పుగా చూపిస్తుందని ఎదురు తిరిగాడు. పూటుగా మద్యం సేవించి ఉన్మాద స్థితిలో ఉన్న కేశవ తన ఒంటిపై ఉన్న చొక్కాను విప్పేసి పిచ్చి పిచ్చిగా అరుస్తూ ఊగిపోయాడు. పక్కనే దొరికిన పింగాణీ ముక్కను చేతిలోకి తీసుకుని దగ్గరికి వస్తే పీక కోసుకుంటానంటూ బెదిరించాడు. ఈ క్రమంలో పింగాణీ ముక్కతో ఎస్ఐపై దాడిచేశాడు. ఈ దాడిలో కిషోర్‌కుమార్ చెంపపై గాయమై తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఈ హఠాత్పరిణామంతో భీతిల్లిన ట్రాఫిక్ సిబ్బంది అతికష్టంపై నిందితులను అదుపులోకి తీసుకుని కరప పోలీసులకు అప్పగించారు. నిందితుడు కర్రి కేశవ ఉప్పలంక గ్రామానికి చెందినవాడు కాగా ప్రస్తుతం పగడాలపేటలో ఉంటూ కాకినాడ ఫిషింగ్‌హార్బర్‌లో పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతని బావ పాలెపు రాజుది అమలాపురం మండలం మాసంగితిప్ప శివారు బ్రహ్మసమాజం అని, అతను కూడా కాకినాడలో ఉంటున్నట్టు చెప్పారు. కేశవ తాత మూడురోజుల క్రితం చనిపోగా గురువారం ఉప్పలంకలో చిన్నదినం జరిగిందని, ఈ దినఖర్మకు వచ్చి బావ, బావమరిది పూటుగా మద్యం సేవించారని కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గాయపడిన ట్రాఫిక్ ఎస్ఐకి కరప పోలీస్‌స్టేషన్‌లోనే ప్రాథమిక చికిత్స చేయించి అనంతరం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులిరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

అమలాపురం టౌన్, మార్చి 28: గత ఏడాది జరిగిన ఇంటి దొంగతనం కేసులో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక స్వామి వివేకానంద వీధిలో నివాసం ఉంటున్న పేరాబత్తుల రాధాకృష్ణ సెప్టెంబరు 8న హైదరాబాద్ వెళ్లగా ఇంటి తాళాలు పగులకొట్టి కనిపించాయని సమీప నివాసితులు అతనికి ఫోను చేశారు. వెంటనే తిరిగి వచ్చి ఫిర్యాదు చేయగా అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పటి సీఐ టి.క్రాంతి కుమార్ ఈ కేసులో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎ1 నిందితుడు ఈతకోట రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి 4.015 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఎస్పీ ఎస్.శ్రీధర్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తును వేగవంతం చేసి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన తానింకి నరేష్ (25), తమ్మినీడి షణ్ముఖమణి (31)ను అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ బుధవారం అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఎస్ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు, సీసీఎస్ సీఐ అబ్దుల్‌సలాంలను ఎస్పీ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

రూ.4.31 లక్షలు సీజ్

ఏలేశ్వరం, మార్చి 28: పత్రాలు చూపకుండా తీసుకెళ్తున్న రూ.4.31 లక్షలను గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. జగ్గంపేట మండలానికి చెందిన లోవరాజు ఈ సొమ్మును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

జేఎన్టీయూకేలో ముగిసిన ఇన్నోవేషన్ ఫెయిర్

జేఎన్టీయూకే, మార్చి 28: జేఎన్టీయూకే వర్సిటీలో రెండు రోజులుగా డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ గురువారం ముగిసింది. సెనేట్ హాల్లో నిర్వహించిన ఇన్నోవేషన్ ఫెయిర్ ముగింపోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎస్టీ డైరెక్టర్ ఏ.గోపాలకృష్ణ, విశిష్ట అతిథులుగా డాక్టర్ కిషోర్‌కుమార్, జగన్‌మోహన్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పరిశోధనల ప్రాజెక్టులు సాంకేతికంగా సహాయ పడతాయన్నారు. అలాంటి వారిని ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మార్చేందుకు తాము తోడ్పాటునందిస్తామన్నారు. అనంతరం నమూనాల ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను, కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీరవల్లి కళ్యాణ్ మనోహర్, డైరెక్టర్లు, అధ్యాపకులు, అను బంధ కళాశాలల పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కళా ప్రకర్షణ



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, మార్చి 28: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం వెండి ధ్వజస్తంభ కళాప్రకర్షణ శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 6 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన నిర్వహించారు. ఉదయం 8.08 నిమిషాలకు ఆవు, దూడ సాయంతో ధ్వజ స్తంభం కదిలించి కళాప్రకర్షణ గావించారు. అనంతరం కళాప్రకర్షణ హోమం జరిపించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఐ.వి రోహిత్, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. చతుర్వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనివేటి మండపంలో కార్యక్రమాలు నిర్వహించడంతో గురువారం రూ.1500 వ్రతం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు. వెండి ధ్వజస్తంభం స్థానంలో దాత సాయంతో బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కానుంది. ఏప్రిల్ 18 నుంచి దీనికి సంబంధించి కార్యక్రమాలు ప్రారంభించి 22న నూతన బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన గావించనున్నారు. నెల్లూరుకు చెందిన ఒక దాత బంగారు ధ్వజస్థంభం ఏర్పాటుకు సుమారు 3.5 కోట్లు వ్యయం చేయనున్నారు.

ఆకట్టుకున్న ఏసు చిత్రం



రాయవరం, మార్చి 28: గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇడుంగమిల్లి సౌదాసాగర్ గీచిన ఏసుక్రీస్తు చిత్రపటం పలువురిని ఆకట్టుకుంది. ఏసుక్రీస్తు శిలువకు వేలాడుతున్న దృశ్యంతో పాటు మరోవైపు రక్తం చిందిస్తున్న ఏసుప్రభు చిత్రపటాన్ని వివిధ రకాల రంగులతో చిత్రీకరించాడు. వివిధ రకాల వాటర్ కలర్స్‌తో ఈ చిత్రం రూపొందించినట్లు సౌదాసాగర్ తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రమించాలి



చౌహాన్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్/(ఆంధ్రజ్యోతి), మార్చి 28: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని శ్రమించి చదువుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ చెప్పారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా ఆయన లాలాచెరువు హైస్కూల్‌ను, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ పనిచేసిన తత్వశాస్త్ర విభాగాన్ని, కందుకూరి వీరేశలింగం పనిచేసిన తెలుగు విభాగాన్ని ఆయన తిలకించారు. అలాగే ప్రాచీనమైన గ్రంథాలకు నిలయమైన కళాశాల గ్రంథాలయం, పురాతన పరికరాలున్న భౌతికశాస్త్ర యాంటిక్ ల్యాబ్‌ను, అంబేడ్కర్ విగ్రహం, తరగతి గదులను శరత్ చౌహాన్ తన సతీమణితో కలిసి సందర్శించారు. ఆయన వెంట ఆర్డీవో చైత్రవర్షిణి, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, డిప్యూటీ ఈవో ఈవీవీబీఎన్ నారాయణ, ఎంఈవో దిలీప్‌కుమార్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీశైలశాస్త్రి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఏవిధమైన శాఖాపరమైన సమీక్షలు గాని, తీర్మానాలు గాని ఆమోదించకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ముగించారు. గురువారం కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈ సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల చైర్మన్‌లు అధ్యక్షత వహించారు. 1,2,4,7 స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు. అదే విధంగా 3వ స్థాయీ సంఘం సమావేశం జడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం స్థాయీ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి అధ్యక్షతన, 6వ స్థాయీ సంఘ సమావేశం జడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశాల్లో జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ సీఈవో జీఎస్ రాంగోపాల్ పాల్గొన్నారు.

కాకినాడ



విరాళం అందజే స్తున్న దాత

నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం, మార్చి 28: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి గురువారం ఏలేశ్వరానికి చెందిన వక్కలంక వెంకటేశ్వరరావు రూ.1,00,116లు విరాళం పీఆర్వో కృష్ణారావుకు అందచేయగా ఆయన అభినందించి వారికి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శనసౌకర్యం కల్పించారు.



పిఠాపురం మండలం కోలంకలో మాట్లాడుతున్న వర్మ

పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం : వర్మ

పిఠాపురం రూరల్, మార్చి 28: పొత్తులో భాగంగా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం మండలం కోలంక, మంగితుర్తి శివారు బుచ్చితిమ్మరాజుపేట గ్రామాల్లో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ, జనసేన నాయకుల ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఇప్పటి కంటే పదిరెట్లు అధికంగా పవన్ కోసం కష్టపడాలన్నారు. పిఠాపురంలో గెలుపును చంద్రబాబుకు బహుమతిగా అందిద్దామని తెలిపారు. సైకో జగన్ పాలన నుంచి ప్రజలందరికి విముక్తి కలగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి : ఏఎస్పీ

గండేపల్లి, మార్చి 28: ఎన్నికలు దగ్గర పడడంతో గ్రామంలో ఎవరూ కూడా ఘర్షణలకు పాల్పడకుండా దూరంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ అన్నారు. ఆయన గురువారం వివాదాస్పద గ్రామాలైన ఉప్పలపాడు, జెడ్.రాగంపేటలో పర్యటించి యువత, గ్రామస్తులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు దిగవద్దని, ఘర్షణలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్ నాశనం చేసుకోవవద్దని హెచ్చరించారు. ఎన్నికల్లో గొడవలకు దిగితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు కూడా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని సూచించారు. ముఖ్యంగా యువత ఎటువంటి ఘర్షణలకు దిగవద్దన్నారు.ఆయనవెంట గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

'ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి'

గొల్లప్రోలు రూరల్, మార్చి 28: ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీసుశాఖ భరోసా కల్పిస్తున్నదని ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి, చినజగ్గంపేట, కొడవలి గ్రామాల్లో గురువారం సాయంత్రం కేంద్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని తెలిపారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు ఇచ్చిన హామీలను నేరవేర్చని జగన్'

రౌతులపూడి, మార్చి 28: జగన్ అరాచక పాలనకు ఇంకా 46 రోజులే మిగిలి ఉందని, బీసీలకు ఇచ్చిన హామీలను నేరవేర్చలేదని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. మూలగపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు, బీసీనేత తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ యామల సురేష్ అధ్యక్షత జరిగిన బీసీల సమావేశంలో సత్యప్రభ ముఖ్యఅతిథి మాట్లాడుతూ బీసీలను గుర్తించింది టీడీపీ అన్నారు. గిడజాంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ తాంటపురెడ్డి రమణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 100 మంది టీడీపీలో చేరగా వారికి సత్యప్రభ పార్టీ కండువాలు వేశారు.

'కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు'

ప్రత్తిపాడు, మార్చి 28: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని ప్రత్తిపాడు ఎంఈవో వి.రాజబాబు చెప్పారు. మండలంలోని ధర్మవరం మండల పరిషత్ మెయిన్ పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బోధనకు అన్నిరకాల సౌకర్యాలు, మౌలిక వసతులు, అధ్యాపక సిబ్బంది ఉన్నారన్నారు. నాణ్యతా ప్రమాణాలు పెరిగిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆదరణ కూడా ఉందని ఎంఈవో తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉద్యోగ సంఘాల జేఏసీ ఛైర్మన్‌గా మూర్తిబాబు

జీజీహెచ్(కాకినాడ), మార్చి 28: కాకినాడ జీజీహెచ్ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా పాలపర్తి మూర్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జీజీహెచ్‌లో వివిధ కేడర్లలో పనిచేస్తున్న 2వేల మంది ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలపై చర్చించేందుకు అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు ఏపీఎన్జీవో హోంలో గురువారం సమావేశమయ్యారు. అన్ని సంఘాలు సంఘటితంగా ఒక వేదికపైకి వచ్చి జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడాలని అన్ని సంఘాల విజ్ఞప్తి మేరకు కాకినాడ జీజీహెచ్ ఎంప్లాయీస్ జేఏసీగా ఏర్పడి కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ ఛైర్మన్‌గా జీజీహెచ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఏపీఎంఈయూ జీజీహెచ్‌శాఖ అధ్యక్షుడు కట్టిమేను మోహనరావు, జేఏసీ గౌరవాధ్యక్షుడిగా రాష్ట్ర డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జయదేవ్‌ను ఎన్నుకున్నారు. ఏపీఎన్జీవో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ డిపోలో 'డయల్ యువర్ డీఎం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 28: కాకినాడ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎంవీ మనోహర్‌తో పలువురు మాట్లాడారు. పెద్దాపురం దర్గాసెంటర్, సామర్లకోట బల్ల మార్కెట్, విఘ్నేశ్వర టాకీస్, మెహర్ కాంప్లెక్స్ బ్రౌన్‌పేట వద్ద టైమింగ్స్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సామర్లకోట-పిఠాపురం బస్సును పెద్దాపురం వరకు పొడిగించాలని కోరారు. తుని, కాకినాడ బస్సులు ఒకేసారి వరుసగా కలిసిపోతున్నాయని సరిగ్గా ఆపడంలేదని డీఎంకు తెలిపారు. కాకినాడ-జి.మామిడాడ మధ్య బడి బస్సును తిప్పాలని, పిఠాపురం- ఏలేశ్వరం మధ్య బస్సులను పునరుద్ధరించాలని పలువురు కోరారు. వీటిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు.

మురారిలో 'భావితరాల కోసం నిలబడదాం'

గండేపల్లి, మార్చి 28: సూరంపాలెంలోని ఆదిత్య కాలేజీ ఎస్ఏసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భావితరాల కోసం నిలబడదాం అనే కార్యక్రమాన్ని మురారి హైస్కూల్‌లో గురువారం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు వయోజన పరిశుభ్రత, ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదిత్య ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్, హైస్కూల్ హెచ్ఎం ఎన్.అమ్మాజీ, ఇన్‌చార్జి సాయిబాబా, కె.తరుణ్, ఎం.రఘునాథ్, ఎస్.గోపి సాయిరామ్, 57మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రారంభం

పెద్దాపురం, మార్చి 28: స్థానిక మెయిన్‌రోడ్డులో ఇటీవల నూతనంగా పునర్నిర్మించిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ప్రముఖ పారిశ్రామికవేత్తలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ దంపతులు. ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెయింటర్ మృతిపై విచారణ!

సామర్లకోట, మార్చి 28: సామర్లకోట పట్టణ శివారున నూతనంగా ఏర్పాటుచేసిన ఈటీసీ లేఅవుట్ నందు నిర్మాణంలో ఉన్న ఇంటికి రంగులు వేస్తున్న పెయింటర్ బుద్ధివీర్రాజు విద్యుద్ఘాతానికి గురై బుధవారం మృతిచెందిన సంఘటనపై విద్యుత్ ఉన్నతాధికారులు గురువారం విచారణ చేపటినట్టు సమాచారం. వాస్తవ సంఘటనపై విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించారు. సంబంధిత ప్రాంత విద్యుత్ లైన్‌మేన్ నిర్లక్ష్యం ఉన్నట్టు అధికారులు సేకరించిన సమాచారంలో పొందుపరిచారు. అధికారులు ఈ సంఘటనపై ప్రత్యేక నివేదికలను జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులకు అందించి తదుపరిచర్యలు తీసుకోనున్నట్టు అధికారుల ద్వారా తెలిసింది.

లయన్స్‌క్లబ్ విజన్‌కు అవార్డులు

సర్పవరం జంక్షన్, మార్చి 28: కాకినాడ లయన్స్ క్లబ్ విజన్ పలు అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల సామర్లకోటలో నిర్వహిచిన లయన్స్ ప్రాంతీయ సదస్సులో లయన్స్ క్లబ్ విజన్ చేపట్టిన పలు సామాజిక సేవా కార్యక్రమాలకు గానూ 16 రకాల అవార్డులను రీజియన్ చైర్మన్ సీహెచ్.శ్రీదేవి చేతుల మీదుగా పురస్కారాలు అందుకోవడం గర్వంగా ఉందని క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు తెలిపారు. ఉత్తమ క్లబ్, ఉత్తమ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి విభాగాలతో పాటూ పలు సేవా కార్యక్రమాలకు ఈ పురస్కారాలు అందుకున్నట్లు క్లబ్ కార్యదర్శి ఎస్.శ్రీదేవిరెడ్డి, కోశాధికారి బి.శ్రీవాణి తెలిపారు. రమాసుందరి, ప్రసూన, సీహెచ్ విజయలక్ష్మి, ఎం.మీనాక్షి సభ్యులున్నారు.

ఆలయాల్లో హుండీల లెక్కింపు

గొల్లప్రోలు, మార్చి 28: గొల్లప్రోలు ఆలయాల్లో హుండీలను గురువారం లెక్కించారు. ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం) హుండీల ద్వారా రూ.95,283, సీతారామస్వామి దేవస్థానం (విష్ణాలయం) హుండీల ద్వారా రూ.49,400 ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో ఈవోలు మూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దించడమే అజెండా

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

» పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం





సామర్లకోట: ప్రచారంలో రాజప్ప, కూటమి నేతలు, కిర్లంపూడి: బూరుగుపూడిలో జనసేన నేతలతో నెహ్రూ

సామర్లకోట, మార్చి 28: జగన్‌ను గద్దె దించడమే జనం అజెండా అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామంలో గురువారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరిట సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, చల్లా బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచారంలో పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు. రాజప్ప మాట్లాడుతూ జగన్ బూటకపు పాలనపై గొంతెత్తే కేసులు, దాడులను చేయించి ప్రాణాలు కూడా తీసేందుకు వెనుకాడడం లేదన్నారు. టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతీఓటరూ సంకల్ప సిద్ధులవ్వాలన్నారు. మహిళలు మంగళహారతులతో రాజప్పకు నీరాజనాలు పలికారు. ముందుగా మ దుగులమ్మకు కొబ్బరికాయ కొట్టి రాజప్ప ఎన్నికల ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో గుమ్మళ్ళ రామకృష్ణ, చీకట్ల వెంకటేష్, కుర్రా నారాయణస్వామి, జి.సర్వేశ్వరరావు, మలకల వెంకట్, తలారి శ్రీను పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపుదాం

కాకినాడ సిటీ, మార్చి 28: పేదలను దోచుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని, సంపద సృష్టించే చంద్రన్న ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో భాగంగా 20వ డివిజన్ రణదీప్‌నగర్, మహాలక్ష్మీనగర్ ప్రాంతాల్లో పర్యటించి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి ఓటు అభ్యర్థించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సంపద సృష్టించే టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ నాయకులు గొరుసు దుర్గారావు, ఆకల దుర్గాప్రసాద్, జూన్ వెస్లీ, కామాడి భైరవస్వామి, ఆకుల శ్రీధర్‌స్వామి, సీహెచ్.నాగరాజు ఉన్నారు.

కూటమి గెలుపే లక్ష్యం

కిర్లంపూడి, మార్చి 28: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో మండలంలోని పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. జనసేన మండల జనసేన అధ్యక్షుడు ఉలిసి అయిరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికల్లో గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. బూరుగుపూడిలో నెహ్రూకు జనసేన నాయకులు రామిశెట్టి రాజు, ఉలిసి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, కుండల మహంతి, జోకా విజయ్, జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ కలిసి వందమంది ఘనస్వాగతం పలికారు. కుంచే తాతాజీ, పాటంశెట్టి రవి, విశ్వనాథం, తోట వెంకటేశ్వర్లు, పాటంశెట్టి కొండరాజులు, మూరా సత్తిబాబు, కర్నాకుల పెదకాపు, బాలుకల చిన్నోడు, బాబ్జి పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోడలు జ్యోతుల లక్ష్మీదేవి, మనవడు అనీష్ నెహ్రూ గోకవరం మండలం తిరుమలాయపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నేత జ్యోతుల నవీన్‌కుమార్ జగ్గంపేటలో గోపాల్‌నగర్, పల్లపు వీధిలో ప్రచారం నిర్వహించి తన తండ్రి నెహ్రూను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, ఎస్వీ ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, సత్తి సదాశివారెడ్డి, జనసేన నేతలు బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిశెట్టి సతీష్ పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో కూటమి విజయం

కరప, మార్చి 28: అన్ని వర్గాల ప్రజల సహకారంతో వచ్చే ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి స్పష్టంచేశారు. కరప శివారు రామకంచి రాజునగర్‌కాలనీలో జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, జనసేన నేత పంతం సందీప్, ఆయా పార్టీల నాయకులు బోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, బోగిరెడ్డి కొండలరావు, ముద్రగడ రమేష్, దేవు వెంకన్న, కాకర్ల బుజ్జిబాబు, దేవు జమిందారు, మద్దూరి స్వామి, గొర్రెల వెంకటరమణ, నిమ్మకాయల సత్తిబాబు, కొబ్బరికాయల ప్రసాద్, యాళ్ల పండు, పేపకాయల మణికుమార్, బొజ్జా భవానీ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్యాయం

తొండంగి, మార్చి 28: వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని, దీనిని సరిదిద్దాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చి తీరాలని యనమల దివ్య అన్నారు. తొండంగిలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. బీజేపీ నేత వెలుగుల గోపాల కృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు బెండపూడి నాయుడు, ప్రధాన కార్యదర్శి పి.రాంప్రసాద్, టీడీపీ నేతలు యనమల రాజేష్, అరిగెల నర్సింహమూర్తి, చొక్కా అప్పారావు, కోడ వెంకటరమణ, పక్కుర్తి వంశీ, నేమాల కృష్ణ, కొయ్యా రామకేశవ, పిర్ల శివ, సాధనాల నూకరాజు, పక్కుర్తి నూకరాజు, శివ,బంతుపల్లి అన్వేష్ ఉన్నారు.

తాళ్లరేవు: రాష్ట్రాన్ని పాలిస్తున్న నరకాసురుడు జగన్‌ని ప్రజలంతా ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోపూరి వెంకటేశ్వరరావు అన్నారు. గాడిమొగ పంచాయతీ లక్ష్మిపతిపురం, పటవల కొత్తూరులో టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించి ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబును గెలిపించాలని ఓటర్లును కోరారు.



తొండంగి: కూటమి నేతలతో ప్రచారంలో దివ్య

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు





కాకినాడ సిటీ: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కొండబాబు, జగ్గంపేట: టీడీపీలో చేరినవారితో నవీన్

కాకినాడ సిటీ, మార్చి 28: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యమని సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. 10వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మోసా దానమ్మ, మాజీ కౌన్సిలర్ మోసా పేతూరు, దుమ్ములపేటకు చెందిన 200మందికిపైగా వారి అనుచరులు, యువకులు, మహిళలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. జగన్నాథపురంలోని వనమాడి ఇంటి వద్ద గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కొండబాబు మాట్లాడుతూ నగరాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నమ్మి వైసీపీ నుంచి పెద్దసంఖ్యలో టీడీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్ దానమ్మ, మాజీ కౌన్సిలర్ పేతూరు మాట్లాడుతూ మత్స్యకార ప్రాంతాలు, మత్స్యకారులు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. మోసా అప్పారావు, మోసా విజయ్, వాసుపల్లి అప్పారావు, వాసిపల్లి దానయ్య, గరికిన రాజు, పెమ్మాడి నాగు, కుంది సంజయ్‌రావు, ఎరుపల్లి సత్తిబాబు, రాగితి లక్ష్మి, ఖైలిపిల్లి సత్యవతి, కంది రత్నం ఉన్నారు.

నవీన్ సమక్షంలో...

జగ్గంపేట, మార్చి 28: జగ్గంపేట వైసీపీ చెందిన లావేటి నాయుడు, లావేటి సత్తిబాబు, లావేటి మహేష్, లావేటి ప్రకాష్, కోనేటి సురేష్, వానపల్లి సురేష్, గనిశెట్టి మహేష్ తదితర 30కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి నవీన్ టీడీపీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు తదితరులున్నారు.

దివ్య సమక్షంలో...

తుని రూరల్, మార్చి 28: రానున్నది బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కూటమి ప్రభుత్వమేనని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంటలో కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ తుని అభ్యర్థి యనమల దివ్యను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కూటమిపార్టీల శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. అనంతరం తొండంగి మండలం పైడికొండ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరగా వారికి దివ్య పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల సుధారాణి, బాబురావు, శివ, గోవిందు, వెంకటేష్, ఆదివిష్ణు, విశ్వనాథం, ఎం.రాంబాబు, నర్సి దుర్గబాబు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో చొక్కా అప్పారావు, బెండపూడి నాయుడు, జాగు గోవిందు, మేడిశెట్టి శ్రీను, నర్సి నారాయణరావు, పలివెల లోవరాజు, గెడ్డం నాగబాబు, మేడిశెట్టి వెంకటేష్, పుట్ట అప్పలరాజు, నక్క శ్రీను, బిరిసి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోమరాయణంపేటలో...

కిర్లంపూడి: సోమరాయణంపేట గ్రామానికి చెందిన వైసీపీ నేత కర్రి సత్యనారాయణ కుటుంబం టీడీపీలో చేరారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, చదరం చంటిబాబు, తూము కుమార్, చినబాబు, గుడాల శ్రీలత, రాంబాబు, పాటంశెట్టి మురళీకృష్ణ, అడబాల కొండబాబు, అనుకుల శ్రీకాంత్, గొడే బాల, చంటిబాబు, శ్రీను పాల్గొన్నారు.

టీడీపీలోకి శీలం సర్పంచ్

కాజులూరు, మార్చి 28: మండలంలో వైసీపీకి చెందిన శీల గ్రామం సర్పంచ్ కోమల వెంకటరమణ వందమంది నాయకులు, అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. రామచంద్రపురం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



కాజులూరు: సర్పంచ్‌ను ఆహ్వానిస్తున్న సుభాష్

ప్రత్తిపాడు హైవేలో వాహనం ఆగిందా..ప్రమాదమే!



ప్రత్తిపాడు హైవేపై నిలిపిన టిప్పర్ లారీ

ప్రత్తిపాడు, మార్చి 28: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు వాహనం ఆగినచో వెనుక నుంచి మరొక వాహనం ఢీ కొట్టి ప్రమాదానికి గురికావడం పరిపాటిగా మారింది. నిత్యం ట్రాఫిక్ రద్దీ, వాహనాల వేగంతో ఉండే ఈ జాతీయ రహదారిపై వాహనం నిలుపుదల చేయడం కూడా ప్రమాదాలకు దారి తీస్తుంది. రహదారి రోడ్డు మార్జిన్ దాటి వాహనాలు నిలుపుదల చేసినా ప్రమాదాలకు గురి కావడం తప్పడం లేదు. ఇదే పరిస్థితితో గత నెలలో పాదాలమ్మ గుడి వద్ద రహదారిలో రోడ్డు మార్జిన్ దిగి టైర్ పంక్చర్ చేస్తున్న ముగ్గురు డ్రైవర్లపై ఆర్టీసీ బస్సు దూసుకుపోగా ముగ్గురు డ్రైవర్లతో పాటు మరో వ్యక్తి కూడా మృతిచెందారు. మినర్వా కళాశాల వద్ద ఆగి ఉన్న లారీని ఆర్మీ అధికారి కారుతో ఢీ కొనడంతో అతడి ఇద్దరు కుమార్తెలు మృత్యువాత పడ్డారు. ఇటువంటి ప్రమాదాలు ఈ జాతీయ రహదారిపై తరుచూ జరుగుతున్న రహదారుల వెంబడి వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతూ ప్రమాదాలు బారిన పడుతున్న వాహనదారుల్లో మార్పు రావడంలేదు. జాతీయ రహదారిపై హైవే అథారిటీ పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసి లారీలు, వాహనాలు అక్కడ నిలుపుదల చేసేలా చర్యలు చేపడితే కొంతవరకు ప్రమాదాలు నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా హైవే అథారిటీ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చినజగ్గంపేటలో ఘర్షణ

ఇద్దరికి గాయాలు

గొల్లప్రోలు రూరల్, మార్చి 28: గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట గ్రామంలో జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణ విషయంలో ఇరువర్గాల మధ్య గురువారం వివాదం ఏర్పడింది. ఈ ఘర్షణలో వైబోగుల నాగేశ్వరరావు, శీరం వీరబాబుకు గాయాలయ్యాయి. వారిద్దరూ పరస్పరం చేసిన ఫిర్యాదుల మేరకు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తెలిపారు.

ఎన్నికల కోసం కంట్రోల్ రూమ్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 28: మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. మిలిటరీ రోడ్ శారదాదేవి ఆలయ ప్రాంతంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న రజక కమ్యూనిటీ హాల్ భవనంలో ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటైందన్నారు. 24గంటలపాటు నిరంతరాయం పనిచేసేలా మూడు షిఫ్ట్‌ల్లో 12మంది ఉద్యోగులు కంట్రోల్‌రూమ్‌లో పనిచేస్తారన్నారు. ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఉంటే ఈ కంట్రోల్ రూమ్ నెంబరు 0884-2349400కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఈ రంగులు మారవా సార్!



వైసీపీ రంగులతో వి.కొత్తూరు రైతు భరోసా కేంద్రం

తుని రూరల్, మార్చి 28: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 2వారాలు కావస్తున్నా అధికారులు వైసీపీ రంగుల విషయంలో తమ కేమీ పట్లనట్టు వ్యవహరిస్తున్నారు. మండలంలో వి.కొత్తూరులో గల రైతు భరోసా కేంద్రం ఇప్పటికీ వైసీపీ రంగుల్లోనే ఉంది. ఎన్నికల కోడ్ ప్రకటించగానే నానా హడావిడి చేసి ఉరుకులు, పరుగులు పెట్టిన యంత్రాంగం ఇలా వైసీపీ రంగులను పట్టించుకోకపోవడంతో అభాసుపాలవుతుంది.

మున్సిపల్ పంప్‌హౌస్‌కు...

సామర్లకోట, మార్చి 28: వైసీపీ రంగుల పిచ్చి ఎన్నికల నోటిఫికేషన్ సమయంలోనూ మారలేదు. సామర్లకోట పట్టణ పరిధిలో నీలమ్మ చెరువు వద్ద బలుసులపేటకు వెళ్లే దారిలో గల ము న్సిపల్ పంప్‌హౌస్‌ను వైసీపీ రంగులతో నింపారు. మోడల్ కాండక్ట్ కమిటీ (ఎంసీసీ) బృందం అధికారుల బృందం ఈ రంగులను తొలగించకుండా చోద్యం చూస్తున్నారు.



వైసీపీ రంగులతో సామర్లకోటలో మున్సిపల్ పంప్‌హౌస్

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల



శ్రీనివాస్‌కు శాలువా కప్పి సత్కరిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, మార్చి 28: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజాను గురువారం ఉదయ్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, జనసైనికులు మర్యాదపూర్వకంగా కలిశారు. తంగెళ్లకు సత్యప్రభ బొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. వారు మాట్లాడుతూ జరగబోవు ఎన్నికల్లో కూటమిదే విజయమన్నారు. అప్పుల ఊబిలోకూరుకుపోతున్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చంద్రబాబుతోనే సాధ్యపడుతుందన్నారు. జగన్ అరాచక పాలనలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో వైసీపీకి పరాజయం తప్పదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణరాజు, టీడీపీ నాయకులు పర్వత సురేష్, కొమ్ముల కన్నబాబు, వెన్నా ఈశ్వరుడు, ఉల్లి వీరభద్రరావు, జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్, మేడిశెట్టి సూర్యకిరణ్, తలపంటి బుజ్జికరణం సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఉదయ్‌శ్రీనివాస్‌కు సత్కారం

ఏలేశ్వరం, మార్చి 28: కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ గురువారం లింగంపర్తిలో ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌కు జనసైనికులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి బాబి, నల్లాల రామకృష్ణ, దాసం శేషారావు, మేకల కృష్ణ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి పొలాలు పరిశీలన



గ్రాంటులో వరిచేల్లోకి దిగి పరిశీలిస్తున్న ఆర్డీవో

తాళ్లరేవు, మార్చి 28: పి.మల్లవరం పంచాయతీ గ్రాంటులో సాగునీటి ఎద్దడితో ఎండిపోతున్న పంట పొలాలను కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ గురువారం పరిశీలించారు. సాగునీరు ఎద్దడి పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని కలెక్టరుకు నివేదించనున్నట్టు ఆర్డీవో తెలిపారు. ఇరిగేషన్ అధికారులు, ఓఎన్జీసీ అధికారులతో చర్చించి పైపులైను తెరిపించారు. దీంతో పంట పొలాలకు సాగునీరు పారుతోంది. తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ ఈశ్వరరావు, వీఆర్వో ప్రకాశరావు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మార్చి 28: గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలు, మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. పిఠాపురం-సామర్లకోట రోడ్డులో ఇరిగేషన్ కార్యాలయం వద్ద, గొల్లప్రోలు మండలం దుర్గాడ సెంటర్ వద్ద అన్ని రకాల వాహనాలు ఆపి వాటిల్లో బ్యాగులు, ఇతర లగేజీలను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జిలు ఆర్వీ ప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు పోలీసులున్నారు.

రౌతులపూడిలో నగదు పట్టివేత

రౌతులపూడి, మార్చి 28: గ్రామంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం రూ.నాలుగు లక్షల యాభై వేలు పట్టుకున్నట్టు అధికారి ఎస్వీరమణ తెలిపారు. బంటా కూలీలకు చెందిన సొమ్ములను బంటామేస్త్రీ బ్యాంక్ నుంచి విత్‌డ్రా చేసుకుని వస్తుండగా పట్టుకున్నట్టు సమాచారం. నగదుకు చెందిన ఆధారాలు చూపిస్తే నగదు తిరిగిచ్చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయంలో టీవీ చోరీ

గండేపల్లి, మార్చి 28: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌కు ఉపయోగించే ఎల్ఈడీ టీవీ చోరీకి గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం రాత్రి టీవీ చోరీకి గురైనట్టు, చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే వస్తువులకు భద్రత లేకపోతే ప్రజల పరిస్థితిఏంటని పలువురు విమర్శిస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని రూరల్, మార్చి 28: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లిన గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడటంతో సుమారు 45 ఏళ్ల వ్యక్తి మరణించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచినట్టు చెప్పారు. మృతుడు సంబంధీకులుంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు.

జనసేనలో చేరనున్న రమేష్

కిర్లంపూడి, మార్చి 28: మండలంలో రామచంద్రపురానికి చెందిన తుమ్మలపల్లి రమేష్ శనివారం పిఠాపురంలో జనసేనఅధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరనున్నారు.